# సుచరిత

-బద్దిగం పాండురంగారెడ్డి

తొలి వేకువ స్వర్శలో కళ్ళు విప్పింది ప్రకృతి. ఉలిక్కిపడి లేచింది సుచరిత. సగం మగతలోనే గుమ్మందాకా నడిచి తలుపు తీసింది. ఎదురుగా శంకరాన్ని చూచి నిద్ర ఎగిరిపోయింది. ఇంత అకస్మాత్తుగా శంకరం రావడానికి గల కారణాన్ని ఊహిస్తోంది. అమ్మ లెటర్ రాసుంటుంది. చెల్లెలి సమస్యను పరిష్కరించడానికి అన్నగారు పరుగెత్తుకుని వచ్చుంటాడు.

"ఏమ్మా! నన్ను లోపలికి రానివ్వవా ఏమిటి?" పరిహాసంగా నవ్వాడు శంకరం.

"ఛ్ఛే! నొ...నొ.. అదేం లేదు మామయ్యా!" తడబడుతూ పక్కకు తప్పుకుని శంకరానికి దారిచ్చింది సుచరిత.

"అన్నయ్యా!" సంభ్రమంగా అన్నగారివంక చూస్తూ అతని చేతిలో బాగ్ అందుకుంది శాంత.

టూత్ పౌడర్ చేతిలో వేసుకుని పెరట్లోకి వెళ్ళింది సుచరిత. తన మీద దాడికి మరో వ్యక్తి వచ్చాడు.

ఉన్నవాళ్ళను ఎదుర్కోవడానికే తనకు శక్తి చాలడం లేదు. ముఖ్యంగా అమ్మ చాదస్తాన్ని, అమాయకత్వాన్ని, మొండి పట్టుదలను భరించలేక పోతోంది.

ఎంతసేపూ కలల్లోనూ, భ్రమల్లోనూ బ్రతకుతారు తప్పితే కళ్లెదుటవున్న వాస్తవాల్ని ఎందుకు గుర్తించరు వీళ్ళు?

సుచరిత ఆలోచనల్లో వుండగానే ఆమె ముగ్గురు చెల్లెళ్ళు, తమ్ముడు లేచి పెరట్లోకి వచ్చారు.

"అక్కా! అమ్మ మామయ్యతో నీ విషయమంతా చెప్పి ఏడుస్తోంది. నిన్ను నాలుగు కేకలేసి దార్లో పెట్టమని బ్రతిమాలుతోంది" సుచరిత పెద్ద చెల్లెలు సుహాసిని అక్క చెవిలో రహస్యంగా చెప్పింది.

సుచరిత గుండె మండిపోయింది.

తనేదో నేరం చేసినట్టు, ఈ ఏడుపులూ, మొత్తుకోళ్ళూ ఏమిటి? ఈ ఫిర్యాదులూ, విచారణలూ ఏమిటి?

అసలు తనంత కాని పనేం చేసిందని?! "అక్కా! అమ్మ కాఫీ పెట్టమంటోంది" తమ్ముడొచ్చి చెప్పాడు. 'స్టౌ' వెలిగించి కాఫీ పెడుతూ ఆలోచిస్తోంది సుచరిత. మామయ్య తెలివిగలవాడు.

నేర్పుగా తనని ఒప్పించడానికి ప్రయత్నిస్తాడు.

ఒడుపుగా తప్పించుకోవడానికి ప్రయత్నించాలి తను.

సుచరిత అసహనంగా ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. మళ్ళీ సాయంత్రం వెళ్ళిపోవలసిన శంకరం భోజనాలవగానే సుచరితను పిలిచాడు.

అప్పటికే పిల్లలందరినీ ఏదో ఒక నెపంమీద బయటికి పంపించింది శాంత. సుచరిత తండ్రి మూర్తి శంకరం ప్రక్కన మౌనంగా కూర్చున్నాడు. సుచరిత తలవంచి ఆలోచిస్తూ శంకరం అడగబోయే ప్రశ్నలకు జవాబివ్వడానికి సంసిద్ధమవుతోంది.

ధైర్యంగా జవాబివ్వాలనుకుంటున్న సుచరితను అంతలోనే నిస్పృహ ఆవరించింది. తన బ్రతుకులో ఏ సంఘటనా సాఫీగా ఏ గోలా లేకుండా జరగనే జరగదా?! గోల! యుద్ధం!! సత్యాగ్రహం!!!

సుచరిత హైస్కూలు చదువు ముగించి కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుదామనుకున్నప్పుడు ఇంత గోలా జరిగింది.

ఐదుగురు పిల్లలతో, నెలలో సగం రోజులు గడిచేసరికే ప్రతి చిన్నదానికీ తడుముకోవలసి వస్తున్న పరిస్థితిలో తను కాలేజీ చదువులకు తూగలేనని చెప్పాడు మూర్తి. ఆడపిల్లకు చదువు, ఉద్యోగాలు అంటే సదభిప్రాయంలేని శాంత సుచరిత చదువుగురించికంటే ఆమె పెళ్ళి గురించే ఎక్కువ ఆసక్తి కనబరిచింది.

"నేను చదువుకుంటాను నాన్నగారూ! నాకిప్పుడే పెళ్ళేమిటి? అమ్మకి మీరు నచ్చచెప్పండి" తల్లి లేకుండా చూచి తండ్రితో అంది సుచరిత.

"నువ్వు చదువుకుని వృద్ధిలోకి వస్తే నాకూ సంతోషమేనమ్మా! కాని... ఖర్చు..." నిస్పృహాయంగా కూతురువంక చూశాడు మూర్తి.

"ఎలాగోలా ఫీజులు కట్టండి చాలు. మరింక దేనికీ మిమ్మల్ని శ్రమ పెట్టను" ఆడపిల్లకు చదువు, స్వంత సంపాదన ఎంత ముఖ్యమో గుర్తించిన సుచరిత తను తప్పక కాలేజీలో చేరాలనే పట్టుదలతో వుంది.

"నాన్నగారూ ప్లీజ్!" తన అసమర్థతకు సిగ్గుపడుతూ ముఖం తిప్పుకున్న తండ్రి చుబుకాన్నెత్తుతూ గారంగా చూచింది సుచరిత.

కూతురి మాటలకు మెత్తబడిన మూర్తిని దులిపేసింది శాంత.

"దానికి తెలివిలేకపోతే మీ ఇంగితమేమయిందండీ? కాలేజీ చదువులంటే మాటలా? ఎక్కడ్నుంచి తెస్తారు డబ్బు? ఓపలేని బరువులు తలకెత్తుకోవడమెందుకో?!"

"ఐతే ఏమిటమ్మా నువ్వనేది?" రెచ్చిపోతూ అడిగింది సుచరిత.

"నోరు మూసుకుని ఇంట్లో కూర్చోమంటున్నాను- లక్షణంగా పెళ్ళి చేసుకుని కాపరానికి వెళ్ళమంటున్నాను"

"అంతేగాని నన్ను చదువుకోనివ్వవన్నమాట! నా కాళ్ళ మీద నేను నిలబడటం నీకిష్టం లేదన్నమాట! ఇరవై ఏళ్ళకే పురుళ్ళతో, పిల్లలతో, ఎదుగూబొదుగూ లేని బ్రతుకులో కూరుకుపోతేగాని నువ్వు శాంతించవన్నమాట!" రుద్ధకంఠంతో ఉక్రోషంగా అడిగింది సుచరిత.

"ఎదుగూ బొదుగూలేని బ్రతుక్కేం ఖర్మే?! దర్జాగా ఏ డాక్టర్నో, ఇంజనీర్నో పెద్ద ఆఫీసర్నో చేసుకుంటావు" దర్పంగా అంది శాంత. కూతురి అందాన్ని చూచి ఏ రాకుమారుడో వరిస్తాడని

కలలు కంటున్న తల్లి మూర్ఖత్వాన్ని సహించలేకపోయింది సుచరిత.

"ఎలా! ఏమైనా ఖజానా వుందా? లంకెబిందెలేమైనా దొరికాయా? ఎలా కొంటావునువ్వు చెప్పిన గొప్పవాళ్ళను'' వెటకారంగా అడిగింది సుచరిత.

నిర్వికారంగా తల్లీకూతుళ్ళ వాదనను వింటున్నాడు మూర్తి.

"చూడండి-చూడండి.. పెద్దంతరం చిన్నంతరం లేకుండా దీని వాగుడు చూడండి.. ఏమిటండీ? అలా గుళ్ళో విగ్రహంలా కూర్చుంచారు? దానిక్కాస్త బుద్ధి చెప్పలేరూ?'' రయ్యిమని లేచింది శాంత.

"అమ్మా! నేను చచ్చినా ఇప్పుడు పెళ్ళి చేసుకోను. నాన్నగారు ఫీజు కట్టకపోతే నలుగుర్నీ చందాలడుక్కునైనా సరే కాలేజీలో చేరతాను. నేను



చదువుకుని, ఉద్యోగం సంపాదించుకున్నాక గాని పెళ్ళి ప్రసక్తి ఎత్తే పని లేదు'' మొండిగా అని అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది సుచరిత.

యుద్ధం చేసి నాలుగు రోజులు తిండి మానేసాక గాని సుచరిత కాలేజీలో చేరటానికి ఒప్పుకోలేదు ఇంట్లో వాళ్ళు.

ప్రపంచాన్నే జయించినంత ఆనందంతో, ఉత్సాహంతో కాలేజీకి వెళ్ళసాగిందామె.

కాని కాలేజీ చదువులపట్ల సుచరితకి ఉన్న ఉత్సాహం జారిపోవడానికెంతో కాలం పట్టలేదు.

కాలేజీ వాతావరణం చాలా విచిత్రంగా వుంది. చదువు చెప్పే వాళ్ళకు, చెప్పించుకునేవాళ్ళకు చదువు మీద ఎలాంటి ఆసక్తీ లేదు. ఉపాధ్యాయులకీ, విద్యార్థులకీ మధ్య ఏవిధమైన ఆప్యాయత లేదు. కొన్నాళ్ళు విద్యార్థుల స్ట్రైక్, కొన్నాళ్ళు ఉపాధ్యాయుల స్ట్రైక్ మొత్తంమీద సగం రోజులు కాలేజీ నడవలేదు.


## విపరీత ధోరణి

మేఘాలయాలో ఇతర రాష్ట్రాలవారు వలస రావడంతో తమ జాతి తరిగిపోయి నశించిపోకుండా ఉండాలంటే తమ సంతతిని పెంచుకుంటూ పోవడమొక్కటే గతి అని ఆదివాసులు, గిరిజనులు నమ్ముతున్నారు. ఏ కుటుంబంలోనైనా ఒక తల్లి పన్నెండుమంది కన్నా ఎక్కువమందిని కంటే **16** వేల రూపాయలు బహుమతిగా ఇస్తామన్నారు వాళ్ల నాయకులు. గత రెండునెలల్లో నలుగురు తల్లులు ఆ బహుమతులు అందుకున్నారు. కానీ షిల్లాంగ్‌లోని సేవా సంస్థలు పిల్లల్ని కనగానే సరిపోదని వారికి మంచి జీవనాన్ని కూడా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులమీద ఉందని ప్రబోధిస్తూ వారి జీవన ప్రమాణాన్ని పెంచవలసిందేనని, ఇలాంటి విపరీత ధోరణుల్ని అరికట్టవలసిందేనని ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

## విమానాల్లో మద్యం తెస్తున్న తంటా

ఇటీవల రష్యా విమానాల్లో ప్రయాణికులకి తమ ఆతిథ్యంలో మద్యం ఇవ్వడం ఎయిర్‌లైన్స్‌వారికి తలనొప్పిగా తయారైందిట. మత్తెక్కిన ప్యాసింజర్లు స్టాఫ్‌తో దౌర్జన్యానికి దిగడం, వద్దన్నా సిగరెట్లు తాగడంలాంటి పనులకు పాల్పడుతున్నారుట. దీంతో విమానాలు ఆలస్యమవడం, ప్రమాదాలకు దారి తీయడం జరుగుతోంది. ఇకనుంచి విమానాల్లో మద్యం ఇవ్వకుండా చేయాలన్న ఎయిర్‌లైన్స్‌వారి ప్రతిపాదనను ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందిట.

-తటవర్తి




అసలెవరైనా ఎందుకు స్ట్రైక్ చేయాల్సివచ్చిందో, ఎవరు ఎందుకు స్ట్రైక్ చేసినా దాని దుష్ఫలితాల్ని మాత్రం తమలాంటి పేద విద్యార్థులెందుకు అనుభవించాల్సి వస్తుందో సుచరితకు అర్థం కాలేదు.

తన క్లాసులో ఏమాత్రం డబ్బువున్న విద్యార్థైనా సరే ప్రతి సబ్జెక్ట్‌కి ప్రైవేట్ చెప్పించుకుంటున్నారు.

ఈ పరిస్థితిలో తనలాంటి విద్యార్థుల గతి అధో గతేనని తెలుసుకున్న సుచరిత దిక్కుతోచక నిలబడి చూస్తూండగానే మొదటి సంవత్సరం గడిచిపోయింది.

తన లక్ష్యం గుర్తుకొచ్చిన సుచరిత తనను తాను సంబాళించుకుని చదువునో తపస్సులా భావించి అహోరాత్రాలు కష్టించి చదివింది. ఆమె మనోనేత్రాలముందెప్పుడూ ఓవర్ కోటు, స్టెతస్కోపు కదలాడుతూ వుండేవి. మరే విషయం మీద ఆసక్తి, అనురక్తిలేకుండా ఒక్క సినిమా, షికారు లేకుండా చదివి ఫైనల్ పేపర్లు రాసింది సుచరిత.

మరో రెండు నెలల్లో మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలు. చాలా మంది గుంటూరులో ప్రసిద్ధి వహించిన ట్యుటోరియల్ కాలేజీల్లో కోచింగ్‌కోసం వెళ్ళారు. కొంతమంది స్థానికంగావున్న ట్యుటోరియల్ కాలేజీల్లో చేరారు. ఇంక ట్యూషన్స్ సరేసరి సుచరితకు ఎంట్రన్స్ పరీక్షల పద్ధతిలో చదవడమెలాగో తెలియడం లేదు. ట్యూషన్ చదవడం తప్ప మరో గత్యంతరం కనబడడం లేదు. ఏమైనా సరే ట్యూషన్ గురించి తండ్రిని ఒప్పించాలని నిశ్చయించుకుంది.

"ఏమిటమ్మా?'' తన చుట్టూ తచ్చాడుతూ అస్థిమితంగా తిరుగుతున్న కూతురు తనకేదో చెప్పాలని ప్రయత్నిస్తూందని గ్రహించాడు మూర్తి. ఉలిక్కిపడి తలెత్తిన సుచరిత అధిక శ్రమతో, అలసటతో వాడిపోయిన తండ్రి ముఖం చూడగానే తను అడగాలనుకున్నది అడగలేకపోయింది.

"అబ్బే! ఏంలేదు నాన్నగారూ!'' తండ్రి చూపుల్ని తప్పించుకుని అక్కడినుండి వెళ్ళిపోయింది.

ఏం చెయ్యాలో తోచక సతమతమవుతూ భయపడుతూ, భయపడుతూనే జువాలజీ, కెమిస్ట్రీ కోచింగ్ ఇస్తున్న లెక్చరర్స్ దగ్గరకు వెళ్ళి తన ఆర్థిక పరిస్థితి చెప్పుకుని తన సందేహాలు తీర్చమని అర్థించింది. వాళ్ళందుకు సులభంగా ఒప్పుకోవడంతో పొంగిపోయింది. ఇంక తనకు మెడిసిన్‌లో సీట్ రావడం ఖాయం అన్న ఆత్మ విశ్వాసంతో, ద్విగుణీకృతోత్సాహంతో పరీక్షకు చదవడం మొదలుపెట్టింది.

★ ★ ★

ఇంటర్ రిజల్ట్స్ వచ్చాయి. ట్యూషన్ లేకపోయినా క్లాసులో ఎప్పుడూ మొదటి నాలుగు రేంక్స్‌లో వుండే సుచరిత తన నంబర్ ఫస్ట్ క్లాసులో లేకపోయేసరికి షాక్‌తింది.

చలనం లేకుండా కూర్చున్న అక్క చేతిలోంచి పేపర్ తీసుకుని నంబర్ కోసం వెదికింది సహాసిని. సెకండ్ క్లాస్‌లో వచ్చిందని అక్కతో అనడానికి భయపడిందామె.

ఇంటర్ రిజల్ట్ సుచరిత మీద పెద్ద దెబ్బ తీసింది. ముందు ఎంత ఆలోచించినా తనకెందుకంత తక్కువ మార్కులు వచ్చాయో, తనతో పోల్చడానికే వీల్లేని వాళ్ళకి కొంతమందికి తనకంటే ఎక్కువ మార్కులెలా వచ్చాయో అర్థం కాలేదు.

అందరూ చెప్పుకుంటున్న మాటల్నిబట్టి, పేపర్లో వచ్చిన వార్తల్నిబట్టి తనలాంటి వాళ్ళెంతోమందికి ఎలా అన్యాయం జరిగిందో తెలిసింది.

మార్క్స్ చూస్తున్న కొద్దీ తను పడిన శ్రమను తలచుకుంటే దుఃఖం ముంచుకువస్తోంది.

ఎవరికి చెప్పుకోవాలి తనకు జరిగిన అన్యాయాన్ని?

ఎవరు వింటారు తన మొరను? ఎవరు తనకు జరిగిన ఘోర అన్యాయాన్ని సరిదిద్దగలరు? ఎవరు కూలిపోయిన తన ఆశల శిఖరాన్ని నిలబెట్టేది?

మతి చలించిన దానిలా కనపడిన వాళ్ళనల్లా అడిగింది. తెలిసిన వాళ్ళని, లెక్చరర్స్‌ని, ప్రిన్సిపాల్‌ని... అందర్నీ అడిగింది. తనకు న్యాయం లభించే దారి చూపించమని తను ప్రాధేయపడిన వారెవరూ తనకేవిధమైన సహాయం చెయ్యలేదు.

తన తండ్రి చేతిలో డబ్బుంటే తనే కొంచెం ప్రయత్నమైన చెయగలదని తెలిసి హతశురాలయింది సుచరిత.

ఆలోచించినకొద్దీ ఆవేశం, ఉద్రేకం పొంగివస్తున్నాయి. ఇలా అన్యాయానికి గురయింది తనొక్కతే కాదు.

తనంత, తనకంటే ఎక్కువగా దెబ్బతిన్నవాళ్ళు లెక్కలేనంతమంది వున్నట్లు తను రోజూ పేపర్లో చూస్తూనేవుంది. వీళ్ళంతా సంఘటితమయి ప్రతిఘటించడంలేదెందుకని?

ప్రతి చిన్న విషయాన్ని గోరంతది కొండంతలు చేసి స్ట్రైకులు చేసే విద్యార్థులు తమ భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు పెడుతున్న ఈ అవకతవకల్ని ఎందుకు సహిస్తున్నారు?

అల్లర్లలో, విధ్వంసచర్యలతో అమోఘమైన ఐకమత్యాన్ని ప్రదర్శించే విద్యార్థులు తమకు జరిగిన అన్యాయానికి కారుకులైన వార్ని గట్టిగా నిలదీసి ప్రశ్నించరెందుకని?

తమ స్వార్థ ప్రయోజనాలకోసం విద్యార్థుల్ని పావులుగా వాడుకునే ప్రజానాయకులు ఇలాంటి విషమ సమయంలో వాళ్ల ప్రక్కన నిలబడి పరిస్థితినెందుకు సరిజేయటం లేదు?

ఇంతటి దారుణాన్ని మౌనంగా సహించి పూరుకుంటున్నందుకు, ఎట్టి ప్రతిఘటన లేకుండా నిర్వీర్యంగా వుండిపోయినందుకు మొత్తం విద్యార్థి లోకమంతా సిగ్గుతో చితికిపోవడం లేదా?.. ఆలోచనలు, ఆలోచనలు, కట్టలు తెంచుకున్న ఆవేశం, ఆవేశం చల్లారేక వచ్చే నిస్సత్తువ ఇవే మిగిలాయి సుచరితకు.

ఆమె ఆలోచనలు, ప్రశ్నలు విని పిచ్చిదాన్ని చూచినట్లు చూచి నవ్వారు. ఈ ఘనమైన ప్రజాస్వామ్య దేశంలో బ్రతుకుతూ చదువుకూడా వెలగబెడుతున్న వ్యక్తి సామాన్యుడి న్యాయం గురించి ఇంత అమాయకపు ప్రశ్నలు వేస్తున్నందుకు జాలి పడ్డారు.

"నయం! ఇంకా నువ్వు అదృష్టవంతురాలి కదూ! ఎన్నో కొన్ని మార్కులంటూ వచ్చాయి నీకు. అసలు పాసయావు అందుకు సంతోషించు, అసలు మార్క్స్ లిస్టులే గల్లంతయిన వాళ్ళు, ఫెయిలయినవాళ్ళు ఎంతమందో?! అన్ని కోర్సులకి అప్లికేషన్లివ్వడానికి గడువుదాటి పోతున్నా మార్క్స్ లిస్ట్ చేరక, తూర్పు తిరిగి దండం పెడుతున్న వాళ్లెంతమందో! డబ్బున్న మహారాజులు డబ్బు వెదజల్లి, పట్టుకోవలిసినవాళ్ళను పట్టుకుని, ఆకాశాన్ని, భూమిని తలక్రిందులు చేసి మార్క్స్ లిస్ట్ సంపాదించారు. ఏ దారీ లేని అభాగ్యులు..." తన ఫ్రెండ్ రజిత అంటున్నది ఇంక వినలేకపోయింది సుచరిత.

"సుచీ! అనవసరంగా మనసు పాడు చేసుకుని మథనపడినందువల్ల లాభమేమీ లేదు. నీ లక్ష్యం మెడిసిన్‌లో సీటు తెచ్చుకోవడం కదా! పరీక్షకు వెళ్ళడానికి కావలసిన మినిమమ్ మార్కులొచ్చాయి నీకు. ఇంక ఈ విషయాన్ని మరిచిపోయి ఎంట్రెన్స్ పరీక్షకు బాగా చదువు" హితవు బోధించింది మరో ఫ్రెండ్ హైమ.

మరచిపోవడంకన్నా చెయ్యగలిగిందేమీ లేదని బాగా అనుభవంలోకి వచ్చింది సుచరితకు.

ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ ఒకవైపు మనసు మండిపోతున్నా తల వంచి రాజీపడడం కన్నా చేయగలిగిందేమీ లేదని గ్రహింపుకు వచ్చిందామెకు.

మళ్ళీ చదువు మొదలుపెట్టింది సుచరిత.

ఈసారైనా తనకు న్యాయం జరిగి తన లక్ష్యాన్ని సాధించగలనన్న ఆశ, సాధించాలన్న పట్టుదల ఒకవైపు, ఈ కొద్దిరోజుల్లో ఇంద్రజాలమేదన్నా జరిగి పరిస్థితులు మారిపోతాయా, ఎందుకు మళ్ళీ మళ్ళీ ఆశలు పేర్చుకోవడం, ఎందుకు మళ్ళీ మళ్ళీ భంగపడడం అన్న నిరాశ ఒకవైపు... కొద్ది రోజులు గడిచేసరికి అన్నిటినీ మరచిపోయి తన సర్వశక్తుల్నీ తన లక్ష్య సాధనమీద కేంద్రీకరించింది సుచరిత.


ఎంట్రెన్స్ పరీక్షలు సంతృప్తిగా రాసిన సుచరిత రిజల్ట్‌కోసం ఆతృతగా ఎదురుచూస్తోంది. అంతలో ఆశ, అంతలోనే నిస్పృహ, అంతలోనే ఆత్మవిశ్వాసం, అంతలోనే బేలతనం.. ఎప్పటికప్పుడు వాయిదాపడి చిట్ట చివరికి రిజల్ట్స్ వచ్చాయి.

సుచరిత బంగారు కలలు కాలిపోయాయి.



## జలాయితో జోడి

సినిమా రంగంలోకి వచ్చిన తరువాత ఎంత అమాయకులైనా తెలివైనవారుగా మారిపోతారు. ఇక హీరోయిన్ల సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. తెలుగులో గ్లామర్ తారగా మారిపోయిన అంకిత ఇప్పుడు జులాయి చిత్రంలో నటిస్తోంది. చిన్న బడ్జెట్ చిత్రమైనా అవకాశాలు లేని సమయంలో వేయక తప్పదని అంకిత అంటోంది. ఈ చిత్రంలో తాను గ్లామర్‌గా కనబడతానని అంటోంది.



ఆశా దీపాలు ఆరిపోయాయి. కోరికల కెరటాలు తీరాన్ని చేరకుండానే విరిగిపోయాయి.

ఒక్క మార్కు తక్కువలో తను ఎక్కవలసిన రైలుని ఎక్కలేకపోయింది సుచరిత.

అన్నిటికంటే భయంకరంగా ఆమె ముందు నిలుస్తున్న సమస్య- భవిష్యత్తు! ఏం చెయ్యాలి?

ఏం చదవాలి, ఎలా చదవాలి? మెడిసిన్‌లో సీట్ వస్తే ఆ ఉత్సాహం, ఉత్తేజం వేరు.


ఉన్న ఊళ్ళోనే మెడికల్ కాలేజీ వుంది కాబట్టి పెద్ద ఖర్చు లేకుండానే ఆ కావలసిన కాస్తకు ఆత్మాభిమానాన్ని చంపుకునైనా ఎలాగోలా చదువులాగించేసేది.

కాని.. ఇప్పుడేమిటి కర్తవ్యం? ఇంక మీదట ఈ మాత్రం కూడా తనవల్ల కాదని చేతులెత్తేశాడు తండ్రి.



## భరోసా

చిరంజీవి చిత్రాల్లో వైరైటీగా కన్పించి ఆయన అభిమానుల్ని కూడా అలరించే శ్రీకాంత్ ఇప్పుడు ఓ చిత్రంలో డీ గ్లామర్‌గా కన్పించనున్నాడు. అదీ చిరుతో కలిసి నటించే చిత్రం కాదు. 'ఆపరేషన్ దుర్యోధన' చిత్రంలో నటిస్తున్న శ్రీకాంత్ చిత్రం గురించి ఈ ఇంట్రడక్షన్ అంతా. అన్నట్టు ఈ చిత్రంలో శ్రీకాంత్ పాత్రకి అందరి ప్రశంసలతో పాటూ అవార్డులు కూడా లభించగలవంటున్నారు. చూద్దాం ఈ అభిమాన సుయోధనుడు ఎంత మంది ఆదరణని చూరగొంటాడో!




తల్లి సాధింపు భరింపశక్యం కాకుండా ఉంది. ఎలా వీటన్నిటినీ ఎదురీదడం?

సుచరిత సమస్యల వెల్లువలో కొట్టుకుపోతూ వుండగా హడావుడిగా వచ్చింది వాణి.

"సుచీ! అలా ఎటైనా వెళ్దాంరావే!'' వస్తూనే తొందర చేసింది వాణి.

పార్కులో పచ్చికమీద కూర్చున్నాక వాణి ముఖంవంక పరిశీలనగా చూసింది సుచరిత.

ఉద్రేకాన్ని బలవంతంగా అణుచుకుంటూంది వాణి.

"ఏమయింది వాణీ?'' ఆప్యాయంగా వాణి చేతినందుకుని అడిగింది సుచరిత.

"ఈ పెద్దవాళ్ళకసలు బుద్ధిలేదే! ఎంతసేపూ వాళ్ల చాదస్తం, మూర్ఖత్వం, డబ్బుయావ వాళ్లదేగాని మనం చెప్పేది వినిపించుకోరు. వాళ్ళు చెప్పేదే రైటనే అహంకారం తప్పితే మన పక్షాన ఆలోచించే సహనంలేదు. అసలు మన జీవితాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే అధికారమెక్కడిది వీళ్ళకు?'' వాణి ఆవేశానికి తెల్లబోయింది సుచరిత.

"ఏం జరిగిందే ఇంత హాట్‌గా వున్నావు?'' నవ్వుతో తేల్చబోయింది సుచరిత.

"ఎంత సేపూ డబ్బు! డబ్బు! వెధవ డబ్బుకోసం మా బావను పెళ్ళి చేసుకోమని ప్రాణం తినేస్తున్నారు మా వాళ్ళు''

సుచరిత మౌనంగా వింటోంది. వెధవ డబ్బు అని ఛీత్కరిస్తుంది వాణి. ఈ వెధవ డబ్బే కనీస అవసరాలకు సరిపడా లేకపోతే ఎంత నరకమో పాపం వాణికి తెలియదు - అనుకుంటోంది.

"మా బావకిది రెండో పెళ్ళి. అతని భార్యపోయి ఐదారేళ్ళయింది. అప్పటినుండి కొడుకును వచ్చే భార్య సరిగ్గా చూస్తుందో చూడదోనన్న భయంతో పెళ్ళి చేసుకోనని భీష్మించుకు కూర్చున్నాడు. అతనికే బుద్ధి పుట్టిందో, అందరి పోరూ పడలేకే ఒప్పుకున్నాడోగాని మళ్ళీ పెళ్ళి ప్రయత్నంలో వున్నాడిప్పుడు. అతని బిజినెస్ బాగా వృద్ధిలో ఉండడంతో మా వాళ్ళకు నన్ను అతనికి కట్టబెట్టాలని ఆశపుట్టి నన్ను వేపుకు తింటున్నారు.''

సుచరితకు వాణి సమస్య స్పష్టంగా అర్థం కాలేదు.

"రెండో పెళ్ళి అనా నీకు ఇష్టం లేదు?''

"కాదు''

"మంచాడేనా?''

"చాలా మంచివాడు. తను రెండో పెళ్ళివాడైనా కట్నంతో సహా కన్నెపిల్ల కావాలని కోరుకునే రోజుల్లో ఏ వితంతువునో, వయసు ముదిరినా పెళ్ళి చేసుకునే అవకాశం లేకపోయిన అమ్మాయినో పెళ్ళి చేసుకోవాలనుకునేంత మంచివాడు. కాని, వితంతువును చేసుకుంటే వాళ్ళ అమ్మ వురేసుకు చస్తానని బెదిరిస్తూంది. అతనికి తెలియకుండా మిగతా అందరూ కలిసి నన్ను ప్రపోజ్ చేశారు'' క్రమేపీ ఆవేశం తగ్గి సౌమ్యంగా మారింది వాణి స్వరం.

"మరేమిటి నీ అభ్యంతరం?''

"మా బావలాంటి మంచి మగాడివల్ల ఎవరో ఒక దురదృష్టవంతురాలి బ్రతుకు బాగు పడుతుంటే, అన్ని కనీస అవకాశాలున్న నేను అడ్డుపడటం మంచిదంటావా?'' విస్మయంతో మరో కొత్త వాణిని చూస్తోంది సుచరిత.

"బావలాంటివాడిని పెళ్ళాడడానికి అభ్యంతరమా?! అతని విషయంలో రెండోపెళ్ళి, కొడుకు వుండడం చాలా చాలా అల్పమైన అంశాలు. ఎవరైనా మరో ఆలోచన లేకుండా అతన్ని పెళ్ళాడేయొచ్చు'' ఇంతగా అతని గుణ గణ కీర్తన చేస్తున్న వాణి అతన్ని పెళ్ళాడతాననటం నిజమైన హృదయ వైశాల్యంతోనేనా లేక త్యాగం చేస్తున్నానన్న గొప్ప కోసమా అన్న సందేహం మెదిలిందో క్షణం సుచరితలో,

అంతలోనే తనను తాను మందలించుకుంది.

తన సంకుచిత దృష్టికి సిగ్గుపడింది.

"ఏం చేస్తావు మరి?"

"అందరూ కలిసి ఏక ఉమ్మడిన హఠాత్తుగా దాడిచేస్తే, ఏమీ తోచకే నీ దగ్గరకు పరుగెత్తుకువచ్చింది"

"బావుంది నాకేం తెలుసే?" నసిగింది సుచరిత. రెక్కలల్లార్చుతూ పైకెగురుతున్న చిలుకల్ని చూస్తూ ఆలోచిస్తోంది వాణి.

★ ★ ★

"సుచీ! ఏమిటమ్మా! ఎందుకింత తొందరపడుతున్నావు పెళ్లికి!" మృదువుగా అడిగాడు శంకరం.

ముగ్గురూ తన వంక బాణాలెక్కు పెట్టినట్లు చూడడం కంపరంగా వుంది సుచరితకు.

జవాబివ్వకుండా కోపాన్ని నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తోంది.

"మాట్లాడవేమమ్మా? రహస్యమా?" రెట్టించాడు శంకరం.

"నీకు రహస్యమెందుకే? నువ్వు బరితెగించావు!" ఖస్సున లేచింది శాంత.

"శాంతా! నువ్వూరుకో!" గదిమాడు మూర్తి.

"ఏమిటమ్మా! చెప్పు" అనునయంగా సుచరితను అడిగాడు శంకరం.

"తప్పో, ఒప్పో, నా స్వంత పూచీమీద నా బ్రతుకునో కొత్త దారికి మళ్ళిస్తున్నాను. అంతా విని నన్నర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి"

"కథల్లోలా ఉపోద్ఘాతాలకేం లోటు లేదు" అందుకుంది శాంత.

"శాంతా!" గదిమాడు మూర్తి.

"రెండో పెళ్ళివాడిని, బిడ్డ తండ్రిని, అందం లేనివాడిని పెళ్ళి చేసుకుంటానంటున్నానని అమ్మకు నా మీద కోపం. ఇంకా ఏ అందాల రాకుమారుడో వచ్చి నా అందాన్ని చూచి మోహించి పెళ్ళాడతాడని అమ్మ భ్రమ. చిత్రంగా నేను కనాల్సిన అందమైన కలల్ని అమ్మ కంటూంది. తనెంత అసంభవమైన ఊహల్లో వుందో అమ్మ గుర్తించడంలేదు" అంత వరకు మొండిగా వున్న సుచరిత ముఖం జీవం లేనట్లుగా అయింది.

"మామయ్యా! నాకు మాత్రం ఈడూజోడూ అయిన కుర్రాడ్ని పెళ్ళి చేసుకుని హాయిగా, ఆనందంగా వుండాలని వుండదా?!"

"నువ్వు మరీ విపరీతంగా ఊహించుకుంటున్నావేమోననిపిస్తుంది?" మధ్యలో అడ్డు తగిలాడు శంకరం. ఈ కాలపు ఆడపిల్లల ఆలోచనలు, ఆశలు, ఊహలు అంటే కొంత అసహనం శంకరానికి.

"నిజం చెప్పండి మామయ్యా? ఇప్పటి పరిస్థితిలో మామూలుగా నా పెళ్ళి అయ్యే అవకాముందనే అనిపిస్తూందా మీకు?... నిజానికి.. నా తక్షణ సమస్య నా పెళ్ళికాదు- నా చదువు" గతుక్కుమన్నాడు శంకరం. సుచరితకు చదువు మీదున్న కోరిక ఈ వివాహానికి దారి తీస్తుందా?!

"నా లక్ష్యం కేవలం చదువు మాత్రమే కాదు. విద్యార్థిగావుంటూ నేనింత వరకు కోల్పోయిన న్యాయాన్ని సాధించడానికి ప్రయత్నించడం, కాలేజీ విద్యార్థినవడానికి పెళ్లి నాకు దొరికిన అవకాశం"

"ఐనా వయసులో నీకంటే బాగా పెద్దవాడిని.." మధ్యలోనే తుంచేసింది సుచరిత.

"ఐతే ఏం? నా కోరికను విని నన్ను నన్నుగా స్వీకరించే సహృదయత, తనకవసరం లేకపోయినా నేను పెట్టిన షరతులన్నిటినీ నిస్సంకోచంగా ఒప్పుకునే ఔదార్యం వున్నాయి. అసలు అతని అర్హతల్ని విమర్శించే ముందు నా అర్హత లేమిటని తర్కించుకుంటే ఇంత ఇబ్బంది వుండదు"

సుచరిత తన అంచనాకి మించి ఎదిగినట్లు గమనించాడు శంకరం. ఆమెను తను ఒప్పించలేననికూడా గుర్తించాడు.

"ఐతే, నువ్వు సంతోషంగానే ఈ పెళ్ళికి సిద్ధపడ్డావన్నమాట?" చెల్లెలి చూపుల్ని తప్పించుకుంటూ అడిగాడు శంకరం.

"సంతోషాన్ని పట్టలేకపోతున్నాను. చదువు అనేది ఒక అందమైన కలగా మిగిలిపోతుందేమోనన్న నిస్పృహలో వున్నప్పుడీ అవకాశం దొరికింది. నా రెండో కల- ప్రేమగా చూచుకునే భర్తతో ముచ్చటైన సంసార జీవితాన్ని గడపడం. అనుకోకుండా నా రెండు కలలు ఒకేసారి నిజమవుతూంటే సంతోషంతో నా గుండె పగిలి పోతూంది మామయ్యా!"

అంతవరకు అన్నగారు కూతురిని ఒప్పించి పెళ్ళిని ఆపు చేస్తాడని ఆశ పెట్టుకున్న శాంత కోపంగా లేచి వెళ్ళిపోయింది. కూతుర్ని అర్థం చేసుకుని ఆమోదించడానికి ప్రయత్నిస్తున్నాడు మూర్తి.

"బ్రతుకులో కొన్నిటిని పొందాలంటే కొన్ని విషయాల్ని సరిపెట్టుకోవాలి, కదూ?!.. మాట్లాడరేం మామయ్యా?!.. మౌనంగా ఆశీర్వదిస్తున్నారా నన్ను?" చిరునవ్వు నవ్వింది సుచరిత. భవిష్యత్తు మీది ఆశతో, తన కోరిక ఫలిస్తుందన్న విశ్వాసంతో తళతళలాడుతున్నాయామె కళ్ళు.

★

## ఇది బీహారులోనే సాధ్యం

బీహార్‌లోని సహర్సాలో పిల్లలు పరీక్షలు రాస్తుంటే వాళ్ళ కాపీలు చేయడానికి టీచర్లు అడ్డు చెప్పారని, తమ పిల్లలచేత చీటింగ్ చేయనివ్వాలని తల్లిదండ్రులు గట్టిగా డిమాండ్ చేసారుట. ఆ మర్నాడే మధేపురాలో అలాంటి కథే జరిగింది. ఎనిమిదివేలమంది ఇంటర్ జువాలజీ పరీక్ష రాస్తుంటే వాళ్లకి కాపీలు అందివ్వడానికి వచ్చారట వాళ్ల పెద్దలు. టీచర్లు అడ్డు చెప్పారని వాళ్ళు ప్రతిఘటించారు. అదెంత హింసకు దారి తీసిందంటే అనేకమంది పోలీసులు గాయపడడమే కాకుండా ఓ పోలీసుజీపు, జిల్లా అధికారి జీపు, పరీక్షలు రాస్తున్న టెంట్లు కూడా తగలబడిపోయాయి. చివరికి పోలీసులు 16 రౌండ్లు కాల్చడం, చివరకు ఆ పరీక్షను రద్దు చేయడం జరిగింది.

## థాయ్‌లాండ్‌లో ముద్దుల తనిఖీ

థాయ్‌లాండ్‌లో ఎవరైనా పబ్లిక్‌గా ముద్దెట్టుకుంటే పోలీసులు వచ్చి వాళ్లని నిలేస్తారు. 18 ఏళ్ల లోపు వాళ్ల మధ్య ముద్దులు నేరం. అనుమానం వస్తే వాళ్లని కస్టడీలోకి తీసుకుని వాళ్లు తాము మేజర్లమని నిరూపించుకునేదాకా పోలీసులు వదలరు. తాగి డ్రైవింగ్ చేసేవాళ్లేకాదు, తాగి పబ్లిక్‌గా ముద్దులాంటి ప్రేమ కలాపాలు చేసేవాళ్లు కూడా ఎక్కువయ్యారట. చిన్న తనంలోనే ఆడపిల్లలు గర్భవతులు అవుతుండడంతో సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు ఇలాంటి ఆంక్షలు విధిస్తున్నారుట!

-తటవర్తి

